క్లుప్తంగా

జిల్లాస్థాయి అవగాహన సదస్సు



నరసరావుపేట: స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో శనివారం ఐటీసీ బంగారు భవిష్యత్తు, సెర్ప్ సంస్థ, గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఘన పదార్థాలు, ద్రవపదార్థాల నిర్వహణపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.విజయ్ కుమార్ పర్యవేక్షించారు. సెర్ప్ డిస్టిక్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, రీసోర్స్ పర్సన్ బొలయ్య, డిడబ్ల్యూఎస్‌సీ రమేష్, సలీం, ట్రైనర్ ఎంవి. ఫ్రాంక్లిన్, యాకోబు, సత్య పాల్గొన్నారు. అనంతరం ఎస్‌బీఎం మండల కోఆర్డినేటర్స్‌కు ఐవోసీ మెటీరియల్ అందజేశారు.

కృష్ణవేణిలో రక్తదాన శిబిరం



నరసరావుపేట ఈస్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలలో శనివారం ఏపీ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నాతాని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో గాయపడి సరైన సమయంలో రక్తం లభించక ఎందరో ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తదానం చేయటం ద్వారా వారి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, వైద్యులు డాక్టర్ కె.రామేశ్వరి, డాక్టర్ పి.స్పందన, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది బి.నాగరాజకుమారి, కె.క్రాంతికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బి. నిర్మల శనివారం పరిశీలించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పోలింగ్ బూత్ పరిసర ప్రాంతాలను కూడా ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో యువరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఎం. సుభాని, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్లలో..



నూజెండ్ల (శావల్యాపురం): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నూజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి వనమా సుబ్బారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రంలో వసతులతో పాటు భద్రత ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం పాఠశాలల్లో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం వంటకాలు రుచి స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్,ఎంపీడీవో పి.ఉమాదేవి, ఎంఈవో రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దారు బాల వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

విధిగా బాధ్యతలు నిర్వహించాలి



శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామసచివాలయాన్ని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాకర్ మక్కెన పద్మావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే గర్భిణులు ఆన్‌లైన్ నమోదు, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ఎస్‌సీడీ సర్వే పనులు నూరుశాతం చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఆటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్య కార్యకర్త గోవిందమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పి పావని, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఎప్పుడు ఆరంభిస్తారో?

- ప్రారంభోత్సవానికి నోచుకోని పెట్రోలు బంకు
- కారుమంచి సొసైటీ రూ.50 లక్షలు నిధుల వినియోగం
- సొసైటీ అధికారుల నిర్లక్షం వల్లే ఈ దుస్థితి
- అలంకార ప్రాయంగా పెట్రోలు బంకు



అలంకార ప్రాయంగా మారిన పెట్రోలు బంకు

శావల్యాపురం: హిందుస్థాన్ పెట్రోల్ బంకు పనులు పూర్తి అయి నెలలు గడుస్తున్నా నేటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. వివరాలు మేరకు మండలంలోని కారుమంచి-గుంటుపాలెం గ్రామాల పరిధిలో జంక్షన్ మెయిన్ రోడ్డు ప్రధాన కూడలి మార్గంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెట్రోలు బంకు మంజూరైంది. దీంతో కారుమంచి సొసైటీ రూ.50 లక్షల వ్యయంతో పెట్రోలు బంకు నిర్మాణం శ్రీకారం చుట్టారు. కారుమంచి, గుంటుపాలెం, మతుకుమల్లి, వయ్యకల్లు, చినకంచర్ల, అడవిపాలెం, భాస్కర్‌నగర్ తదితర గ్రామాల్లోని వాహనదారులకు, ట్రాక్టరు యజమానులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు కావటం చేత పలువురు ఉపాధి అవకాశాలు ఉండటంతో పాటు నాణ్యమైన పెట్రోలు, డిజిల్ అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వం ఆమోదించిన ధరలకు అమ్మకాలు పారదర్శకంగా జరుగుతాయని వాహనదారులు అభిప్రాయాలు వెల్లడించుతున్నారు. ఖరీఫ్, రబీ సీజను పూర్తి అయినా నేటి వరకు పెట్రోలు బంకు ప్రారంభోత్సవం కాకపోవటంతో వ్యవసాయ అనుబంధ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో జిల్లా కలెక్టరు ప్రారంభోత్సవం చేయాలని ఆదేశాలు జారీ చేసిన ఫలితం లేదు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఈ బంకు ఆరంభమైతే చాలా సౌకర్యంగా ఉంటుంది. గత్యంతరం లేకపోవటంతో వాహనదారులు శావల్యాపురం, అడ్డరోడ్డు, ఏల్చూరు, వినుకొండ ప్రాంతాలకు పెట్రోలు, డిజల్ కోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

పెట్రోలు బంకు ప్రారంభించాలి



పెట్రోలు బంకు పనులు పూర్తి అయి నెలల గడుస్తోంది. నేటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోకపోవటం చేత వాహనదారులు పెట్రోలు, డిజల్ కోసం అగచాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే ప్రారంభోత్సరం జరిగేలా చర్యలు తీసుకోవాలి. గత ఏడాదిలో ప్రారంభోత్సవం జరుగుతుందని ముందుగానే బంకులో డీజిల్, పెట్రోలు నిల్వలు సిద్ధం చేశారు.

–బొల్లా వెంకట సాంబశివరావు, మాజీ సొసైటీ చైర్మన్, కారుమంచి

పనులు పూర్తయ్యాయి

పెట్రోల్ బంకు పనులు పూర్తి అయిన మాట వాస్తవమే. సాంకేతిక సమస్య కారణంగా ప్రారంభోత్సవం చేయలేక పోయాం. త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– నర్రా సురేంద్రబాబు, సొసైటీ చైర్ పర్సన్ అధికారి

కూటమి ప్రభుత్వ తీరుకు నిదర్శనం



కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలల గడుస్తోంది. కేవలం సొసైటీ అధికారుల నిర్లక్షం వల్ల పెట్రోలు బంకుకు ఈ దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న వాటిని నిరుపయోగంగా చేయటం చాలా బాధాకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రోలు బంకు ప్రారంభోత్సవం చేయాలి

–చుండూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ, కారుమంచి

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

జిల్లా రవాణాశాఖాధికారి సంజీవ్‌కుమార్



సంజీవ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ సరళాదేవి



హాజరైన విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: రహదారి భద్రతా నియమాలను పాటించటం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండాలని జిల్లా రవాణాశాఖాధికారి జి.సంజీవ్‌కుమార్ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ అధ్యక్షత వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతిరోజు ఎందరో ప్రాణాలను కోల్పోవటంతో పాటు మరెందరో క్షతగాత్రులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు భద్రతా నియమాలను పాటించాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనంపై మితిమీరిన వేగం, ఇద్దరుకు మించి ప్రయాణం చేయరాదని సూచించారు. సదస్సులో భాగంగా డ్రైవింగ్ శిక్షణాధికారి ఎం.వాసు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, రహదారి భద్రతా నియమాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివనాగేశ్వరరావు, ఏఎంఐలు ఎస్.శ్రావ్య, ఎం.ఎల్.వంశీకృష్ణ, కంటివైద్య నిపుణులు డాక్టర్ నవ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఏ.సరళాదేవి, టి.వి.శంకరరెడ్డి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏడి ‘పింఛెన్’

- పింఛన్ కోసం అవ్వా–తాతలకు అవస్థలు
- రెడ్డినగర్ ప్రధాన సెంటర్‌లో డబ్బులు పంపిణీ
- చలిలో తీవ్ర ఇబ్బందులు

నరసరావుపేట రూరల్: పెన్షన్ పంపిణీని ప్రభుత్వం అభాసుపాలు చేస్తోంది. ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. లబ్దిదారులను ఒక చోటకు రమ్మని చెప్పి పెన్షన్‌ను పంపిణీ చేస్తున్నారు. శనివారం పంపిణీ చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లో ఇది కనిపించింది. రెడ్డినగర్ ప్రధాన సెంటర్‌లోని వైఎస్ విగ్రహం వద్ద సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ నిర్వహించారు. ఆ ప్రాంతంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్ కోసం అక్కడకు చేరుకున్నారు. సర్వర్ పనిచేయకపోవడం, సచివాలయ సిబ్బందికి అందజేసిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున 6గంటల నుంచి చలిలో పెన్షన్ కోసం రోడ్డు మీదే వేచి ఉండాల్సి వచ్చింది. దాదాపు మూడు గంటల తరు వాత 9 గంటల సమయంలో వీరికి పెన్షన్‌ను అందజేశారు. ఇంటి వద్దకే పెన్షన్ అంటూ ప్రభు త్వం ప్రచారం చేసుకుంటూ తమను ఇబ్బందులకు గురిచేయడం పట్ల అవ్వా–తాతలు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీ ఎన్‌జీజీఓస్ జనరల్ సెక్రటరీకి సత్కారం

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా నియమితులైన విద్యాసాగర్ మొదటిసారి గుంటూరు జిల్లా నాన్ గెజిటెడ్ అండ్ గజిటెడ్ ఆఫీసర్స్ హోమ్‌కి శనివారం వచ్చిన సందర్భంగా ఏపీ ఎన్‌జీజీఓస్ సత్తెనపల్లి, క్రోసూరు యూనిట్ బాధ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యాసాగర్‌ను సత్కరించారు. సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు, సెక్రెటరీ అంబేడ్కర్, ట్రెజరర్ కోటేశ్వరరావు, ఏపీ ఎన్‌జీజీఓస్ క్రోసూర్ యూనిట్ అధ్యక్షుడు షేక్ బాషా, సెక్రటరీ మహేష్ ఉన్నారు.

చిల్లరకు ‘పది’ంతల కష్టం



పది రూపాయల నోట్లు



కెనరా బ్యాంక్‌లో రూ.10 నాణేల పంపిణీ

- మార్కెట్‌లో తగ్గిన రూ.10 నోట్ల చలామణి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, చిరు వ్యాపారులు

సత్తెనపల్లి: పది రూపాయల నోటు చలామని ప్రస్తుతం మార్కెట్‌లో తక్కువగా ఉంది. దీంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలామణిలో ఉన్న నోట్లు చిరిగినవి, బాగా దెబ్బ తిన్న నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. ఉన్న పది రూపాయల నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయేలా ఉన్నాయి. నిరక్షరాస్యులైన వ్యాపారులు, ప్రజలు చిరిగిన నోట్లను తీసుకునేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. రూ.10 నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో లేదు. చిరు వ్యాపారులు, కూరగాయల దుకాణాలు, చిన్న హోటళ్లు, టీ కొట్టులు, ఆటో వాలాలు, బస్సుల్లో చిల్లర ఎఫెక్ట్ బాగా ఉంది. రూ.100 నోటు ఇస్తే తిరిగి చిల్లర ఇచ్చేందుకు వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

రూ.10 నాణేలు పంపిణీ

రూ. 10 నోట్లు లేక క్షేత్రస్థాయిలో చిరు వ్యాపారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న కెనరా బ్యాంక్ సత్తెనపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు పది రూపాయల నాణేలను పంపిణీ చేశారు.

డిజిటల్ చెల్లింపులతో కొంత మేలు

చెల్లింపులతో చెలామణిలో చిల్లర సమస్య చాలా వరకు తీరింది. కానీ, బస్సుల్లో యూపీఐ చెల్లింపులకు..కండక్టర్ వద్ద ఉన్న ఆర్టీసీ యాప్ సక్రమంగా పనిచేయడం లేదని ప్రయాణికులు అంటున్నారు. చిల్లర సమస్య ఉందని భావించిన కొందరు రూ.10 నోట్లను భద్రపరుచుకుంటున్నారు. బ్యాంకుల ద్వారా రూ.10, రూ.20 నోట్లు విరివిగా విడుదల చేసి, వ్యాపారాల లావాదేవీలకు అంతరాయం కలగకుండా చిల్లర సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి ఎనిమిదో తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. దీని నిమిత్తం కోర్టులో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెమిస్టర్ ఫలితాల్లో సీఆర్ విద్యార్థుల సత్తా

నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ తృతీయ సెమిస్టర్ ఫలితాల్లో గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బీఎస్సీ కెమిస్ట్రీ మెయిన్స్‌లో రాగి సాయి సృజన వందకు వంద మార్కులు సాధించగా, నాలుగు సెమిస్టర్‌లలో 626 మార్కులతో టాపర్‌గా నిలిచింది. బీకాం కంప్యూటర్ విభాగంలో పి.అఖిల ట్యాక్సేషన్ సబ్జెక్టు నందు వందకు వంద మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ చుండి రంగనాయకులు, ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

రాజుపాలెం: సైబర్ నేరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వేణుగోపాల్ కోరారు. మండలంలోని పెదనెమలిపురి, వీరమ్మ కాలనీల్లో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పొద్దని సూచించారు. జెరాక్స్ సెంటర్‌లో పొరపాటున కూడా వాటిని మరచిపో వద్దన్నారు. మత్తు పదార్థాలకు పిల్లల్ని దూరంగా ఉంచాలని తెలిపారు. ప్రధాన దేవాలయాలకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: అనంతవరం గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా(44) గత నెల 30వ తేదీ నడుస్తూ అదుపు తప్పి సీసీ రోడ్డు పై పడిపోగా తలకు గట్టిగా దెబ్బ తగిలింది. క్షతగాత్రుడిని గుంటురు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐనాగేంద్రరావు తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు) : మండలం దొడ్లేరు గ్రామంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సును ఎస్ఐ నాగేంద్రరావు శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. ప్రజలు, యువత మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు ఎవరైనా విక్రయిస్తుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. దొంగతనాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామ పెద్దలు సహకారం అందిచాలన్నారు. గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతిచెందిన ధూపాటి ఆదెయ్య

బొల్లాపల్లి రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని పేరూరుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధూపాటి ఆదెయ్య (48) ద్విచక్ర వాహనంపై వెల్లటూరు గ్రామం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా పేరూరు పాడు గ్రామం నుంచి ఎదురుగా వచ్చిన కారు ఢీ కొంది. ప్రమాదంలో ఆదెయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ప్రమాదంలో మృతుడి కుమార్తె గూడూరి మరియ కుమారి, కొత్త సంతోషం ఇరువురు మహిళలకు గాయాలయ్యాయి. మృతుని కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెంఘీజ్‌ఖాన్‌పేట సర్పంచ్ పోలావతి మృతి



పోలావతి (ఫైల్)



పరామర్శిస్తున్న మాజీ మంత్రి రజని

యడ్లపాడు: మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లవరపు పోలావతి (36) అనారోగ్యంతో మృతి చెందారు. పంచాయతీ శివారు గ్రామమైన సంగంగోపాలపురంలో నివాసం ఉండే పోలావతి 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్టీ మహిళా కోటాలో వైఎస్సార్‌సీపీ తరుపున నామినేషన్ వేసింది. గ్రామస్తులందరి మద్దతుతో ఏకగ్రీవంగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. నాటి నుండి వివాద రహిత సర్పంచ్‌గా పేరుతెచ్చుకుంది. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటుంది. మూడు రోజుల కిందట ఆరోగ్యం మరింత క్షీణించడంతో కాటూరి వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త నాగమల్లేశ్వరరావు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ సభ్యుల పరామర్శ

సర్పంచ్ పోలవతి మృతి విషయం పార్టీ శ్రేణుల నుంచి తెలుసుకున్న మాజీ మంత్రి విడదల రజిని శనివారం గ్రామానికి విచ్చేశారు. పార్టీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, గ్రామపార్టీ అధ్యక్షులు చాతరాజుపల్లి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ, ఎంపీటీసీ వావిళ్ల పోలేరు, వంకాయలపాడు సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరావు, కొత్తపాలెం, కోట మాజీ సర్పంచ్‌లు కాకర్లపూడి అంకారావు, షేక్ షంషుజుహా, మల్లె సుబ్బారావు, బాబు తదితరులు ఉన్నారు.

బీసీల ఆశాజ్యోతి వైఎస్ జగన్

మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రథమ ప్రాధాన్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ఆశాజ్యోతిగా నిలిచారని మాజీ మంత్రి విడదల రజిని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా బీసీ విభాగం నూతన అధ్యక్షుడిగా గురజాలకు చెందిన సిద్దాడపు గాంధీ ఇటీవల నియమితులయ్యారు. ఆయన శనివారం చిలకలూరిపేట పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్లో సింహభాగం బీసీలకే దక్కాయని గుర్తు చేశారు. పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేయడంతో పాటు బీసీలకు ఎదురొతున్న సమస్యలను గుర్తించి పోరాటాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సిద్దాడపు గాంధీని సత్కరించారు.

యానాది కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



ఎంపీడీవో ఉమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని కమ్మవారిపాలెం యానాది కాలనీ మౌలిక వసతులు కల్పించాలని యానాది సంఘం మహకూటమి రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి కోరారు. శనివారం కాలనీలో సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఎంపీడీవో పి.ఉమాదేవి, తహసీలారు ఆర్.రమేష్‌కుమార్‌లకు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంచార జీవులైన యానాదులకు స్థిరనివాసం కల్పించి కాలనీలో మంచినీటి సౌకర్యం,విద్యుత్‌కరణ, డ్రెయినేజీ వ్యవస్థవంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే కాలనీలో 70 కుటుంబాల్లో 18 మంది పిల్లలకు ఆధార్ కార్డులు ఉండగా మిగిలిన వారందరికీ ఆధార్ లేనందున బడిబాటకు దూరం అవుతున్నారన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని, రేషన్ కార్డు అందజేసి సామాజిక గుర్తింపు తేవాలని అధికారులను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కత్తి బాలకోటయ్య, ప్రభుదాసు,గంగినేని బాబు, కంచు మాటి నరేష్‌లు ఉన్నారు.

ఇర్లపాడులో న్యాయసేవా సదస్సు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహతి

శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో న్యాయ సేవా సదస్సు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వినుకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహతి పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరు చట్టాలపై ప్రజలు అవగాహన కల్గి యుండాలన్నారు. సివిల్ వివాదాలు గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు నూతన చట్టాలపై గురించి ప్రజల్లో చైతన్యం కల్గియుండాలన్నారు. వైద్యం అనేది ప్రతి ఒక్కరు ప్రాథమిక హక్కు అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని అలా పరీక్షలు చేయించుకున్న భార్యాభర్తలు వైద్యాధికారి కూడా శిక్షకు పాత్రులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జిపై స్టీల్‌గడ్డర్ల పనులు పూర్తి



రైల్వే వంతెనపై పనులు పూర్తి చేసిన రైల్వే అధికారులు

శావల్యాపురం: శావల్యాపురం కొంకేరు వాగు రైల్వే బ్రిడ్జిపై నూతనంగా చేపట్టిన స్టీల్ గడ్డర్లు ప్రధాన పనులు రైల్వే అధికారుల పర్యవేక్షణలో శనివారంతో ముగిశాయి. గతంలో ఒక్కో స్టీల్‌గడ్డర్ అమర్చడానికి 20 రోజులు పడుతుందని నూతన ఆధునీకరణ సాంకేతిక పరిజ్ఞానంతో రెండు రోజుల వ్యవధిలో 8 స్టీల్‌గడ్డర్లు అమర్చినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

రైల్వే డీఆర్ఎం పర్యవేక్షణలో రైల్వే అధికారులు పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టారు. రెండు రోజుల వ్యవధిలో 200 మంది రైల్వే కూలీల సహాయంతో ఆధునీకరణ నాలుగు క్రేన్ల ద్వారా స్టీల్ గడ్డర్లు యుద్ధప్రతిపాదికపై పనులు చేశారు. అలాగే వంతెనపై నడవటానికి అనుకూలంగా ఉండేలా, రైల్వే దిమ్మెలు మరింత పటిష్టంగా ఉండేలా పనులు చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైంది



మాట్లాడుతున్న తెలుగురీడర్ పీవీ సుబ్బారావు

నాదెండ్ల: సమాజంలో ఉపాధ్యాయుని వృత్తి ఎంతో కీలకమని, దేశ భవితను నిర్మించటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని ప్రముఖ సాహితీ విమర్శకుడు, తెలుగురీడర్ డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కూరాకుల సత్యనారాయణ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని వీడ్కోలు సభ నిర్వహించారు.సత్యనారాయణను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సభకు హెచ్ఎం కె.పద్మజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ముప్పయ్ ఏళ్లగా పనిచేసి వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారన్నారు. కళాశాలలో తాను అధ్యాపకుడిగా పనిచేసిన సమయంలో సత్యనారాయణ తన వద్ద చదువుకున్నారని, ఎంతో కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి ఆదర్శవంతంగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కామినేని లలితా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గుర్రం ఉపేంద్ర, గ్రామ నాయకులు పూనాటి పెద్దారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.